
సాక్షి
పల్నాడు
సోమవారం ׀ 5 ׀ ఆగస్టు ׀ 2024



శాకంబరి అలంకారంలో అమ్మవార్లు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లు ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 4012 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1179 క్యూసెక్కులు వదిలారు.

బండ్లమ్మ ఆలయంలో పూజలు



చందోలు(పిట్టలవాని పాలెం): చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖి బండ్లమ్మ వారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు జరిపించారు.

న్యూస్‌రీల్

శాకంబరి అవతారంలో సాయి మహరాజ్



నరసరావుపేట: పట్టణంలోని ప్రకాష్ నగర్ శ్రీ సాయిక్షేత్రంలో ఆదివారం సాయిబాబా శాకంబరి మాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేశం మొత్తం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో ఆషాఢ మాసంలో శాకంబరి అలంకారంతో అనేకమంది దేవతామూర్తులు దర్శనమిస్తూ ఉంటారని ఆలయ ధర్మకర్త మురారిశెట్టి గోపాలబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాయి క్షేత్రం నందు కూడా శాకంబరి మాత అలంకారంలో దర్శనమిచ్చినట్లుగా పేర్కొన్నారు. వందలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ వాసవి మిత్ర మండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, ప్రధానార్చకులు కృష్ణమాచార్యులు రమేష్‌కుమార్, మండవ వెంకటరత్నం, విజయ, రామసీత పాల్గొన్నారు.

శాకంబరి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు

సత్తెనపల్లి: ఆషాఢమాస అమావాస్యను పురస్కరించుకొని పట్టణంలోని ఐదులాంతర్ల సెంటర్‌లో వేంచేసి ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో ఆదివారం మహాలక్ష్మి అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో శాకంబరి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటలవరకు, సాయంత్రం 6 నుంచి 8 వరకు పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కలెక్టర్ సీసీపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: మహిళ ఉద్యోగిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న కలెక్టర్ సీసీపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ భాస్కర్ ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రావిపాడు గ్రామానికి చెందిన ముద్దా నాగమణి రెండు సంవత్సరాలుగా అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన కలెక్టర్ బంగ్లాలో వంట మనిషిగా పని చేస్తోంది. బంగళాలో కలెక్టర్ సీసీగా పనిచేసే ఆర్ఐ షేక్ జానీ బాషా ఆమెపై కొన్నినెలలుగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. తన మాట వినకపోతే కలెక్టర్‌కు చెప్పి ఉద్యోగం తీసివేయిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో లైంగిక వేధింపులతో పాటు అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అడవులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు

జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు



రాజుపాలెం: అటవీ ప్రాంతాలు అక్రమణలు గురి కాకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు తెలిపారు. మండలంలోని దేవరంపాడు శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన నగర వనాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ నగరవనంలో దాదాపుగా అన్ని పనులు పూర్తి అయినట్లు తెలిపారు. త్వరలో అందరికీ అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. అడవుల పర్యవేక్షణలో భాగంగా గుత్తికొండ, హేమగిరి చుట్టు పక్కల ప్రాంతాల్లో కొత్తగా ఆక్రమణలు జరగకుండా చూస్తామని తెలిపారు. ఆక్రమణలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి వెంకటరమణ, బీట్ అధికారి మనోజ్‌కుమార్ ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి చీరాల ముస్తఫా నగర్‌కు చెందిన మద్దుల నాగేశ్వరరావు కుటుంబం రాంకౌశిక్, యశస్విని పేరిట నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

మొక్కుబడి చదువులు

అగమ్యగోచరంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల భవిష్యత్తు

- సక్రమంగా పంపిణీ కాని విద్యాకానుక కిట్లు
- ప్రభుత్వ పాఠశాలలపై సర్కారు శీతకన్ను
- మధ్యాహ్న భోజనంపై విద్యార్థుల అనాసక్తి
- ఇప్పటికీ అందని విద్యాకానుక కిట్లు
- ఉపాధ్యాయ ఖాళీల భర్తీపై ఆసక్తి చూపని వైనం

వైఎస్సార్ సీపీ హయాంలో అన్నివిధాలా అభివృద్ధి చెంది, ఆధునికంగా తయారైన ప్రభుత్వ పాఠశాలలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం గాలికి వదిలేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు సరఫరా చేయకపోవడంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. విద్యాకానుక కిట్లు సైతం సకాలంలో అందజేయకపోవడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. మరో వైపు మధ్యాహ్న భోజనం రుచి తగ్గుతోంది. వంట ఏజెన్సీలకు బిల్లుల చెల్లింపులో జాప్యం, నిత్యవసర సరుకుల ధరలు పెరగడం, కమీషన్ల కోసం అధికార పార్టీ నేతలు ఒత్తిళ్లకు గురి చేయడంతో నిర్వహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకో వైపు జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల సమస్య వేధిస్తోంది. దీంతో కొత్త ప్రభుత్వంలో పేదలకు నాణ్యమైన విద్య ప్రశ్నార్థకంగా మారుతోంది.

నరసరావుపేట: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల తీరు నూతన ప్రభుత్వంలో అగమ్యగోచరంగా తయారైంది. స్కూళ్లల్లో చదివే పిల్లలపై ప్రభుత్వానికి ఏ మాత్రం శ్రద్ధ కన్పించటంలేదు. గత ప్రభుత్వంలో స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా యూనిఫామ్‌లు, బూట్లు, ఇతర కిట్ పరికరాలను ఎంపిక చేసి సమయానికి అందజేయగా, ఈ ప్రభుత్వంలో అటువంటి దాఖలాలు ఇప్పటివరకు కన్పించలేదు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన వాటినే సక్రమంగా పిల్లలకు పంపిణీ చేయలేదు. దీంతోపాటు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల



రొంపిచర్ల మండలం కొత్తపల్లి జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి తక్కువ సంఖ్యలో హాజరైన విద్యార్థులు

పెరిగిపోయాయి. కొన్నిచోట్ల మార్పులు, చేర్పులు జరిగాయి. జిల్లావ్యాప్తంగా ఏడు ప్రదేశాల్లో పిల్లలు లేక స్కూళ్లను తెరిచే పరిస్థితి లేదు. అంతేగాకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు చర్యలు రెండు నెలల తర్వాత చేపట్టారు. ప్రభుత్వ విద్యపై పాలకులు ఏమాత్రం ఆసక్తి చూపించటంలేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

సాక్షి గ్రౌండ్ రిపోర్టు

జిల్లాలో విద్యార్థులు..

పల్నాడు జిల్లాలో మొత్తం 28 మండలాల్లో ఈ ఏడాది 2033 పాఠశాలలు ఉండగా వాటిలో 2,91,962మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో బాలురు 1,50,864, బాలికలు 1,41,095మంది ఉన్నారు. జిల్లాలోని విద్యావ్యవస్థను నరసరావుపేట, సత్తెనపల్లిగా రెండు డివిజన్లుగా విభజించారు. నరసరావుపేట డివిజన్‌లోని 1164 పాఠశాలల్లో 1,63,470 మంది ఉండగా, సత్తెనపల్లిలోని 869 స్కూళ్లలో 1,28,492మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.



విద్యార్థులకు చేరని పుస్తకాలు

విద్యాకానుక పంపిణీ ఇలా..

పేదపిల్లలు చదివే ప్రభుత్వ స్కూళ్లపై ప్రస్తుత పాలకులు శీతకన్ను వేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం సగం మంది విద్యార్థులకే పంపిణీ జరిగింది. మొత్తం విద్యార్థులు 2,91,962మంది ఉండగా, బ్యాగులు 1,54,946, బెల్టులు 1,07,973 మందికి, డిక్షనరీలు 31,156 రాగా వాటిలో బెల్టులు 1,06,804మందికి, డిక్షనరీలు 18,327మందికి పంపిణీ చేశారు. నోట్‌బుక్‌లు 9,03,760రాగా అన్నింటిని పంపిణీ చేశారు. బూట్లు 1,55,070 రాగా వాటిలో 1,54,840మందికి, టెక్స్ట్‌బుక్‌లు 13,15,674రాగా 13,01,164మందికి, అందజేశారు. యూనిఫామ్‌లు 1,54,936మందికి రాగా 1,39,893 మందికి మాత్రమే అందజేశారు.

సక్రమంగా లేని మధ్యాహ్న భోజనం

గత ప్రభుత్వంలో పకడ్బందీగా ఉదయమే రాగిజావ, మధ్యాహ్న భోజనం, సాయంత్రం చిక్కీలు పంపిణీ చేసి విద్యార్థుల ఆకలి తీర్చగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఇవి సక్రమంగా అమలుకావట్లేదు. వారంలో ఐదురోజులు కోడిగుడ్లు, మూడు రోజులు చిక్కీలు, మరో మూడు రోజులు రాగిజావ అందజేయాల్సి వుండగా అదీ సక్రమంగా సాగట్లేదు. స్కూళ్లలో మధ్యాహ్న భోజనం తక్కువ మంది మాత్రమే తింటున్నారు. గతంలో సుమారుగా 2లక్షల మంది మధ్యాహ్న భోజనం చేస్తుండగా నేడు ప్రభుత్వం తీసిన లెక్కల ప్రకారమే సరాసరిగా మధ్యాహ్న భోజనం 93,565మంది చేస్తుండగా, గుడ్లు 96,575మంది, చిక్కీలు 98,915 మంది, రాగిజావ 93,108 మందికి అందజేస్తున్నారు.

పకడ్బందీగా అమలుచేస్తున్నాం

జిల్లాలో ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి స్కూళ్ల నిర్వహణ పకడ్బందీగా అమలుచేస్తున్నాం. ప్రభుత్వం నుంచి వచ్చిన విద్యాకిట్లు అన్నింటిని వందశాతం మందికి అందజేశాం. ప్రభుత్వ స్కూళ్లలో ఉపాధ్యాయుల సర్దుబాటు చర్యలు చేపట్టాం. పిల్లలు లేని స్కూళ్లలో మళ్లీ పిల్లలను చేర్చేందుకు చర్యలు తీసుకున్నాం. మధ్యాహ్న భోజనం హాజరైన ప్రతి ఒక్కరికీ అందజేస్తున్నాం.

– పి.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి

తీవ్రంగా సబ్జెక్టు టీచర్ల కొరత

జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 1,143 ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు విద్యాశాఖాధికారులు లెక్కలు వేశారు. కాగా గత జనవరి నుంచి జూలై నెలాఖరు వరకు ఉద్యోగ విరమణలతో ఒక్క గుంటూరు జిల్లాలోనే 300 వరకు పోస్టులు ఖాళీ అయ్యాయి. వీటిలో హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు ఉన్నారు. గుంటూరు జిల్లాలోని 1,071 ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగు వేల మంది ఉపాధ్యాయులు పని



చేస్తుండగా, అందులో 10 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

జెడ్పీ జాగా.. వేసెయ్ పాగా!

- జిల్లా పరిషత్ స్థలంపై టీడీపీ నేతల కన్ను
- రూ. కోట్ల విలువైన రెండు ఎకరాలు దక్కించుకునేందుకు యత్నాలు
- సత్తెనపల్లి ప్రధాన రహదారి పక్కన కబ్జా తంతు
- ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం

సత్తెనపల్లి: సామాన్య ప్రజలు గూడు కోసం చిన్న పాక వేసుకుంటే అధికారులు నానా హంగామా చేసి, అది ఊడ పెరికేదాక ఊరుకోరు. అయితే ఏకంగా రూ. కోట్లు విలువచేసే జెడ్పీ భూమి తమ కళ్లెదుటే దర్జాగా ఆక్రమించుకుంటున్నా తమకేమీ పట్టనట్లు కళ్లకు గంతలు కట్టుకొని కూర్చున్నారు. ఇదీ పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ప్రధాన రహదారి పక్కన గల రెండు ఎకరాల జెడ్పీ స్థలం ఆక్రమణ తంతు. సత్తెనపల్లి పట్టణంలోని గుంటూరు – మాచర్ల ప్రధాన రహదారి పక్కన వడ్డవల్లి రఘురాంనగర్ పరిధిలోని సర్వే నెంబర్ 12లో 3 ఎకరాల భూమిని కట్టమూరి అహోబిల భాస్కరరావు విద్యాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని విద్యాసంస్థలు నెలకొల్పి అభివృద్ధి చేసేందుకు జెడ్పీకి దానం ఇచ్చారు. ఆ భూమి అవసరం లేని పక్షంలో తమ కుటుంబ సభ్యులకు ఇవ్వమని అప్పట్లో బైలాలో రాసుకున్నారు. అయితే ఆ భూమిలో ఎకరం భూమిని అయ్యప్ప స్వామి దేవాలయానికి కేటాయించడంతో ఆలయం నిర్మాణం పూర్తయి ప్రస్తుతం పూజలు జరుగుతూ వాడుకలో ఉంది.

కోర్టులో భూ వ్యవహారం..

ఎంతో దయార్ద్ర హృదయంతో విలువైన భూమిని దానం ఇచ్చినప్పటికీ మిగిలిన రెండు ఎకరాల భూమిని ఖాళీగా ఉంచారు. ఎలాంటి విద్యాసంస్థలు నెలకొల్పకపోవడంతో తన తండ్రి ఆశయం నెరవేరలేదు కనుక తిరిగి భూమిని తమకు అప్పగించాలని అహోబిల భాస్కరరావు కుమారుడు కట్టమూరి నరసింహారావు జెడ్పీని కోరాడు. దీనిపై అధికారులు ఏమీ తేల్చకపోవడంతో కట్టమూరి నరసింహారావు వేరొకరికి రెండు ఎకరాలు విక్రయించాడు. దీనిపై అటు జెడ్పీ అధికారులు, ఇటు కట్టమూరి నరసింహారావులు కోర్టును ఆశ్రయించగా జెడ్పీకి అనుకూలంగా తీర్పు వచ్చింది. అయితే కట్టమూరి నరసింహారావు నుంచి కొనుగోలు చేసిన వ్యక్తులు మరొకరికి భూమిని విక్రయించాడు. వారు కూడా కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం కోర్టులో నడుస్తోంది.

అన్యాక్రాంతం కాకుండా గత ఎమ్మెల్యేల కృషి..

సత్తెనపల్లిలోని విలువైన రెండు ఎకరాల జిల్లా పరిషత్ స్థలం అన్యాక్రాంతం కాకుండా గత ముగ్గురు ఎమ్మెల్యేలు కృషి చేశారు. 2004, 2009లో సత్తెనపల్లి శాసనసభ్యుడుగా ఎన్నికైన యర్రం వెంకటేశ్వరరెడ్డి ఆ స్థలాన్ని సంరక్షించారు. అనంతరం 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ కోడెల శివప్రసాదరావు విలువైన



సత్తెనపల్లి వడ్డవల్లి పరిధిలోని జెడ్పీస్థలం



జెడ్పీ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణం

జిల్లా పరిషత్తు స్థలం వృథాగా ఉంటే అన్యాక్రాంతమవుతుందనే ఉద్దేశంతో కొంత స్థలంలో పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఇక 2019 సార్వత్రిక ఎన్నికల్లో శాసనసభ్యుడిగా ఎన్నికైన అంబటి రాంబాబు విలువైన రెండు ఎకరాల జిల్లా పరిషత్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా రూ. 20 లక్షలు వినియోగించి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం, రెండు వైపులా గేట్లు ఏర్పాటు చేయించారు.

ఆక్రమణల యత్నాల్లో టీడీపీ నేతలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విలువైన రెండు ఎకరాల జెడ్పీ స్థలంపై టీడీపీ నేతల కన్ను పడింది. లీజు అగ్రిమెంట్ రాయించుకొని కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు వేగంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే జెడ్పీస్థలానికి ముందు భాగంలో రోడ్డు పక్కన చిరువ్యారులు చిన్న చిన్న బంకులు ఏర్పాటు చేసుకున్నారు. జెడ్పీ స్థలంలో నిర్మించిన గెస్ట్‌హౌస్ పక్కన ఖాళీ స్థలం ఆక్రమించి వెంకటేశ్వర జనరల్ స్టోర్ పేరుతో ఇనుముతో తయారు చేయించిన బంకు ఏర్పాటు చేశారు. ఇలా ఆక్రమణల పర్వం మొదలైంది. టీడీపీకి చెందిన ఓ ముఖ్య నాయకుడు పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌కి పక్కన ఖాళీగా ఉన్న స్థలాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేశాడని ఆ పార్టీ వర్గాలే బహిరంగంగా చర్చించుకుంటున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కృష్ణమ్మ పరవళ్లకు 57 ఏళ్లు

- సాగర్ కాలువలకు తొలిసారి నీటిని విడుదల చేసి 57 ఏళ్లు పూర్తి
- నేడు ప్రాజెక్టు నుంచి నీటిని వదలనున్న అధికారులు

విజయపురిసౌత్: రెండు తెలుగు రాష్ట్రాలకు వరప్రదాయిని అయిన నాగార్జున సాగర్ ప్రాజెక్టు కాలువలకు నీటిని విడుదల చేసి ఈ నెల 4వ తేదీతో 57 ఏళ్లు నిండాయి. 1955 డిసెంబర్ 10న ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. స్వతంత్ర భారతావనిలో నిర్మించిన ఈ ఆనకట్ట మానవ నిర్మితాలలో ప్రపంచంలోనే అతిపెద్దది. 1967 ఆగస్టు 4న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. అప్పుడు రైతుల కళ్లల్లో ఆనందం తొణికిసలాడింది. అప్పటివరకు బీళ్లుగా ఉన్న భూముల్లో రైతులు నేటికీ సిరులు పండిస్తున్నారు. నాడు కటిక పేదరికం అనుభవించిన అన్నదాతలు నీటి లభ్యతతో ఆర్థికంగా కూడా బలపడ్డారు. తాగు, సాగునీటికి ఈ ప్రాంతవాసులకు ఇబ్బంది లేకుండా పోయింది. కుడి కాలువకు నెహ్రూ పేరిట



నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఫైల్)

జవహరు కాలువగా నామకరణం చేశారు. ఈ కాలువ తవ్వకాన్ని 1956 అక్టోబర్ 10న అప్పటి ఉప ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ప్రారంభించారు. సాగర్ రిజర్వాయర్ నుంచి ఈ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద 9 గేట్లను అమర్చారు. ప్రపంచంలోని అత్యంత పొడవైన కాలువలలో ఒకటిగా ఖ్యాతి సంతరించుకుంది. 'జై జవాన్ – జై కిసాన్' అని పిలుపునిచ్చిన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి పేరును ఎడమ కాలువకు పెట్టారు. డ్యామ్‌కు 6 కి.మీ. దూరంలో ఉన్న పొట్టిచెలం ప్రాంతం నుంచి ఈ కాలువ ప్రారంభం అవుతుంది. కాలువ ప్రవ



నీటిని విడుదల చేసిన అనంతరం మాట్లాడుతున్న ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ (ఫైల్)

హించే సొరంగమార్గం దేశంలోనే పెద్దది. ఈ సొరంగం నిర్మాణానికి 1959లో అప్పటి రాష్ట్ర గవర్నర్ భీమ్ సేన్ సచార్ శంకుస్థాపన చేశారు. సాగర్ ప్రాజెక్టు మరమ్మతులకే రూ.వేల కోట్ల వ్యయం చేశారు. గ్యాప్ ఆయకట్టుకు నీరందకపోవడంతో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రాజెక్టు ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ప్రపంచబ్యాంకు ఆర్థిక సహాయంతో రూ.4,444.44 కోట్లతో ప్రణాళిక తయారు చేసి, పనులను ప్రారంభించారు. ఆ పనులు 2014కే పూర్తి కావల్సినా జులై 2016 నాటికి ముగిశాయి.

మరణంలోనూ వీడని స్నేహం

- స్నేహితుల దినోత్సవం రోజున విషాదం
- హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి
- గత 20 ఏళ్లుగా ఇరువురి మధ్య స్నేహం
- విప్పర్ల గ్రామంలో విషాదఛాయలు

వారిద్దరూ చిన్ననాటి స్నేహితులు.. పక్కపక్కన ఇళ్లల్లో ఉండే వారిద్దరి మధ్య విడదీయరాని స్నేహబంధం ఉంది. ఇద్దరూ ఉద్యోగ, విద్య రీత్యా వేర్వేరు చోట్ల ఉంటుండగా స్నేహితుల దినోత్సవం రోజైనా కలుసుకుని, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టుకుని, ఎన్నో కబుర్లు చెప్పుకోవాలని ఆశించారు. అనుకున్నదే తడవుగా ఒక్కచోట కలుసుకున్నారు. అయితే చాలా రోజుల తర్వాత కలుసుకున్నామన్న సంతోషం వారికి కొంతసేపైనా మిగల్చకుండా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసింది. స్నేహితుల దినోత్సవం రోజున ప్రాణస్నేహితులు ఇద్దరూ మృతిచెందడం విప్పర్ల గ్రామంలో విషాదచాయలు నింపింది.



రోహిత్ (ఫైల్)



బాల ప్రసన్న (ఫైల్)

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామానికి చెందిన చిన్ననాటి స్నేహితులైన ఇద్దరు యువకులు శనివారం అర్ధరాత్రి తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ప్రమాదంలో కె. రోహిత్(27) యు.బాలప్రసన్న(25) మృతి చెందారు. రోహిత్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం స్నేహితుల దినోత్సవం కావడంతో రోహిత్‌తో గడిపేందుకు అదే గ్రామానికి చిన్ననాటి స్నేహితుడు బాల ప్రసన్న (25) శనివారం విప్పర్ల నుంచి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో ఇరువురు స్నేహితులు శనివారం రాత్రి హైదరాబాదులో ద్విచక్ర వాహనంపై కేబుల్ బ్రిడ్జి మీదుగా వెళుతున్న సమయంలో డివైడర్‌ని ఢీకొని బ్రిడ్జిపై నుంచి కిందపడి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసులు మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రి శవాగారానికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గ్రామస్తులు ఆదివారం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రి చేరుకొని మృతదేహాలను స్వగ్రామం విప్పర్లకి తరలించారు.

- రోహిత్ ఆ కుటుంబానికి పెద్దవాడై ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అలాగే తండ్రి లేని రోహిత్ తన తల్లిని పోషించటంతో పాటు తన సోదరుడిని కూడా చదివిస్తున్నాడు. పిల్లల చిన్నతనంలోనే భర్తను కోల్పోయిన రోహిత్ తల్లి రోదన గ్రామస్తులను కలచివేస్తుంది.
- అలాగే బాలప్రసన్న తన తండి నాగేశ్వరరావుకు మూడవ సంతానం. తండ్రి నాగేశ్వరరావు వ్యవసాయం చేస్తుండగా, ఇద్దరు కుమారులు వ్యవసాయంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. తన కుటుంబంలో ఒక్కడైనా చదువుకున్న వాడు ఉండాలని, చిన్నవాడైన బాలప్రసన్నను ఇంజినీరింగ్ వరకు చదివించాడు. పై చదువుల కోసం విదేశాలకు పంపాలనే ప్రయత్నంలో ఉన్నాడు. ఈ తరుణంలో తన స్నేహితుడితో కలిసి ఫ్రెండ్ షిప్‌డే నిర్వహించుకోవాలని హైదరాబాద్‌కు వెళ్లిన గంటల వ్యవధిలోనే బాలప్రసన్న మృతి చెందాడన్న విషయం తెలియటంతో కుటుంబ సభ్యులంతా శోకసముద్రంలో మునిగి పోయారు. గ్రామస్తుల కళ్లెదురుగా పెరిగిన ఇద్దరు యువకులు చనిపోయారని తెలియటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు మృతుల కుటుంబ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నరసరావుపేటరూరల్: గుంటూరు–కర్నూలు హైవేపై కాకాని డొంక సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. బాపట్ల జిల్లా సంతమాగులూరు గ్రామానికి చెందిన జడ పెద్దబాజీ(23) తన స్నేహితుడైన మందలపాటి బుజ్జి ఇరువురు బుల్లెట్ వాహనంపై నరసరావుపేట వైపు వస్తున్నారు. కాకాని డొంక సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ వీరు ప్రయాణిస్తున్న బుల్లెట్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెద్దబాజీ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన బుజ్జిని 108 వాహనంలో పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రోశయ్య తెలిపారు.

ఇళ్లపై దాడి ఘటనలో ఐదుగురి అరెస్టు

మాచవరం: మండలంలోని పిన్నెల్లిలో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లపై టీడీపీ శ్రేణులు దాడులు చేసి, ఆస్తి నష్టం కలిగించిన కేసులో ఐదుగురు నిందితుల్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అమీనుద్దీన్ తెలిపారు. దాడుల్లో పాల్గొన్న మిగతా వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. సంఘటనలో పాల్గొన్న వారిని గుర్తించి అరెస్టు చేస్తామని పేర్కొన్నారు.

పసికందు సహా తల్లి అదృశ్యం



ప్రత్తిపాడు: పసికందు సహా తల్లి అదృశ్యమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామానికి చెందిన తడవర్తి నాగరాజుకు మూడు సంవత్సరాల కిందట పల్నాడు జిల్లా గురజాల సమీపంలోని పల్లెగుంత గ్రామానికి చెందిన త్రివేణితో వివాహమైంది. వీరికి పాప, 11 నెలల బాబు సంతానం. వేరు కాపురం పెట్టాలనే విషయమై దంపతుల మధ్య చిన్న గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం త్రివేణి తన పదకొండు నెలల పసికందును తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో భర్త ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు తెలిపారు.

ఆదివాసీ సదస్సును జయప్రదం చేయండి



అశ్వకుల్లాఖాన్ కాలనీలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీడీఎం నాయకులు

నరసరావుపేట: ఆదివాసీలపై జరుగుతున్న దమనకాండను వ్యతిరేకిస్తూ ఈనెల 9, 10 తేదీల్లో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న అఖిల భారత ఆదివాసీ సదస్సును జయప్రదం చేయాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక అశ్వకుల్లా ఖాన్ కాలనీలో పీడీఎం ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జి రామకృష్ణ మాట్లాడుతూ మధ్య భారత దేశంలో ఖనిజ సంపద కొల్లగొట్టడం కోసం ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా ప్రాంతాల్లో నివాసం ఉండే ఆదివాసీలపై ముప్పేట దాడులకు పాల్పడుతున్నాయన్నారు. ప్రతి రెండు కిలోమీటర్లకు ఒకటి చొప్పున సీఆర్‌పీఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేసి ఆదివాసులు తమ గూడేల నుంచి బయటికి రావాలంటేనే భయానికి గురయ్యే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. బయటకు వస్తే దాడులకు గురవుతున్నారని, వేలాది మంది ఆదివాసులు జైల్లో మగ్గి పోతున్నారని, జనవరి నుంచి ఇప్పటివరకు 200 మందికి పైగా ఆదివాసులు, విప్లవకారులు హత్యగావించబడ్డారని అన్నారు. ఈ దాడులకు వ్యతిరేకంగా ఆదివాసులు పోరాడుతున్నారని, వారికి సంఘీభావంగా తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఏర్పడిందన్నారు. అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం సందర్భంగా అఖిల భారత సదస్సు జరుగుతుందన్నారు.. ఈ సదస్సులో సీపీఐ ఆల్ ఇండియా కార్యదర్శి రాజా, ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి, హరగోపాల్, మాడభూషి శ్రీధర్, రిటైర్డ్ జడ్జి సుదర్శన్‌రెడ్డి, మాల్వి సుబ్రహ్మణ్యం, సోనీ సోరి, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పాల్గొంటారన్నారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర రాజకీయాలకు చిరునామా ఎన్టీఆర్

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు వెస్ట్: రాష్ట్ర రాజకీయ చరిత్రలో మాజీ సీఎం ఎన్టీఆర్‌కు ప్రత్యేక స్థానం ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కొనియాడారు. స్థానిక 39వ డివిజన్ టీడీపీ నాయకుడు సింగిశెట్టి వీరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు 4 దశాబ్దాల క్రితమే రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం ఎన్టీఆర్ కల్పించారన్నారు. నగర అభివృద్ధిలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను కలుపుకొని ముందుకు వెళతామన్నారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్లా మాధవి మాట్లాడుతూ.. తమలాంటి వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలు ఈ రోజు అసెంబ్లీ, పార్లమెంట్‌లలో కూర్చోగలుగుతున్నామంటే ఎన్టీఆర్ స్ఫూర్తే కారణమని పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు మొహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ.. 1983లో ఎన్టీఆర్ మైనారిటీలకు ఎక్కువ సీట్లు కేటాయించి అసెంబ్లీకి పంపడంతోనే తమ వర్గాలకు రాజకీయ ప్రాబల్యం ఊపందుకుందన్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, డేగల ప్రభాకర్, నిమ్మల శేషయ్య, ముత్తినేని రాజేష్ పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి బాలుడు మృత్యువాత



మృతుడు నాయబ్ ఖాజా

నరసరావుపేట రూరల్: స్నేహితులతో ఈతకు వెళ్లిన బాలుడు నీటమునిగి మృతి చెందిన ఘటన ఆదివారం కోటప్పకొండ వద్ద చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని చిన తురకపాలెం గ్రామానికి చెందిన షేక్ నాయబ్ ఖాజా(15) యల్లమంద జెడ్పీ హైస్కూలులో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో గ్రామానికి చెందిన స్నేహితులతో కలిసి కోటప్పకొండ సమీపంలోని చిలకలూరిపేట మేజర్ కాలువలో ఈతకు వెళ్లాడు. కొంతసేపు ఈత కొడుతూ సరదాగా గడిపారు. ఆ తర్వాత మేజర్ కాలువ నుంచి కోటప్పకొండ చెరువుకు నీటిని సరఫరా చేసే బావిలో ఈత కొట్టేందుకు ఖాజా అందులోకి దూకాడు. నీటిలో నుంచి పైకి రాకపోవడంతో స్నేహితులు గమనించి కేకలు వేశారు. మేజర్ కాలువ వద్ద ఉన్న వారు బావిలో దూకి ఖాజాను బయటకు తీసుకువచ్చారు. అపస్మారకస్థితిలో ఉన్న అతడ్ని పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడు ఖాజా తండ్రి ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బాలుడు మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తింపుపై చట్టసభల్లో మాట్లాడాలి

ఎంపీ లావు, ఎమ్మెల్యే చదలవాడకు పీఎంపీ, ఆర్‌ఎంపీల విజ్ఞప్తి



ఎంపీ లావును కలిసిన మెడికల్ ప్రాక్టీషనర్స్ ప్రతినిధులు

నరసరావుపేట: ఆర్‌ఎంపీ, పీఎంపీలకు గుర్తింపు, శిక్షణపై పార్లమెంట్, అసెంబ్లీలలో మాట్లాడాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబులను నరసరావుపేట డివిజన్ ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆదివారం తెలిపారు. దీనిపై స్పందించిన వారు వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడి గుర్తింపు వచ్చేలా కృషి చేస్తానని తమకు భరోసా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు షేక్ బాజీ, కార్యదర్శి షేక్ సైదా, ఉపాధ్యక్షుడు వెంకట శేషయ్య, నరసరావుపేట పట్టణ, రూరల్, ముప్పాళ్ల, నాదెండ్ల మండలాల అధ్యక్షులు వీరాంజనేయులు, ఎస్.రాజు, షేక్ నాగూర్‌వలి, ఆయా మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నాణ్యతా లోపాలుంటే చర్యలు

- మంత్రి మనోహర్
- జగనన్న కాలనీల్లోని ఇళ్ల పనుల పరిశీలన



నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్: తెనాలి మండలం పెదరావూరు, కొల్లిపర మండలంలోని సిరిపురం, దావులూరు గ్రామాల్లోని జగనన్న కాలనీ లేఅవుట్‌లను రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం పరిశీలించారు. కాలనీలో ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాలపై లబ్ధిదారుల అవగాహన సదస్సులో పాల్గొనేందుకు ఉదయం 9.30 గంటలకు కాలనీకి మంత్రి వచ్చారు. తర్వాత కాలనీలో పరిశీలించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓ ఇంటి ముందు 'అమ్మబడును' అని పెట్టిన బోర్డును చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అక్కడ నివసిస్తున్న కొందరు తమ సమస్యలను మంత్రి మనోహర్ దృష్టికి తీసుకొవచ్చారు. గంజాయి బ్యాచ్ ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు పేర్కొన్నారు. వెంటనే పోలీస్ అధికారులను మంత్రి పిలిపించారు. రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లు తమను ఇబ్బందులు పెడుతున్నారని పలువురు లబ్ధిదారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అలాంటి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తెనాలిలో ఇళ్ల నిర్మాణాల అవకతవకలపై తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నలతో కమిటీని వేశారు. క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి ఇళ్ల నిర్మాణంలో అక్రమాలపై నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. తర్వాత లబ్ధిదారుల అవగాహన సదస్సులో మాట్లాడారు. అక్రమ లేఅవుట్‌లకు అనుమతి ఇచ్చి లబ్ధిదారులను నిండా ముంచారని వ్యాఖ్యానించారు. అనర్హులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని ఆరోపించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఉగాది నాటికి పేదలు గృహ ప్రవేశం చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. నెల తరువాత కలిసి చర్చిద్దామని చెప్పారు. సిరిపురం లేఅవుట్‌లో తొమ్మిది వేల మందికి ఇళ్లు మంజూరు చేసినా కేవలం ముగ్గురు మాత్రమే గృహం నిర్మించుకున్నారని తెలిపారు. దావులూరు లేఅవుట్‌లో రోడ్లు లేక వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు ఆయన దృష్టి తెచ్చారు. నెల రోజుల్లో రూ. 10 లక్షలు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఓఎస్డీ ఎస్. ఏసురత్నం, మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న, తహసీల్దార్ కేవీ గోపాల కృష్ణ, ఎంపీడీఓ కాటూరి శిల్ప, హౌసింగ్ ఈఈ వై. భాస్కరరావు, డీఈ రఫీవుల్లాఖాన్, ఏఈ పిచ్చయ్య, విజయవాడ ఎలక్ట్రికల్ ఈఈ కనస్ట్రక్షన్స్ ఎం. శ్రీనివాసరావు, డీఎస్పీ బి.జనార్దనరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

6 నుంచి ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి పరీక్షలు

నగరంపాలెం: ఉమ్మడి గుంటూరు జిల్లాలో 54 ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి గతేడాది ఉత్తర్వుల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ క్రమంలో 2023 మార్చి 25న 34 పోస్టులకు ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. దీనిపై పిటిషనర్లు హైకోర్టులో కేసు విత్ డ్రా చేసుకున్నారు. దీంతో మిగతా 20 పోస్టులకు ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు గుంటూరు సిద్ధార్థనగర్‌లోని జేసీ కళాశాల ఆఫ్ లాలో రీడ్ అండ్ రైట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న 5,116 మంది అభ్యర్థులకు ఆయా తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. డ్రైన్ క్లీనర్ పోస్ట్‌కు 86 దరఖాస్తులు స్వీకరించగా, 6న ఉదయం పరీక్ష జరగనుంది. 2 గ్యాంగ్ మజ్దూర్ పోస్టులకు 385 దరఖాస్తులు స్వీకరించగా, 6న మధ్యాహ్నం నిర్వహిస్తారు. 12 పబ్లిక్ హెల్త్ వర్కర్ పోస్టులకు 2,840 దరఖాస్తులు స్వీకరించగా, 7, 8, 9 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్ష జరగనుంది. 3 స్వీపర్ పోస్టులకు 974 దరఖాస్తులు స్వీకరించగా, 12న ఉదయం, మధ్యాహ్నం పరీక్ష ఉంటుంది. హోల్ టైం సర్వెంట్ పోస్ట్‌కు 235 దరఖాస్తులు స్వీకరించగా, 13న ఉదయం పరీక్ష జరగనుంది. కళాసి పోస్ట్‌కు 596 దరఖాస్తులు రాగా, 13న మధ్యాహ్నం పరీక్ష ఉంటుంది. ఉదయం 10.30 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు ఆయా తేదీలలో పరీక్షలు ప్రారంభం అవుతాయి. అభ్యర్థుల ఒరిజినల్ ఆధార్ కార్డులు పరిశీలించాకే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని ఆదేశించారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ నుంచి పరీక్షా కేంద్రం వరకు బస్‌లు నడపాలని నిర్ణయించారు. 6 నుంచి 13వ తేదీ వరకు పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ పహారా ఏర్పాటు చేయనున్నారు.

మూఢ నమ్మకాల నిర్మూలనే జేవీవీ లక్ష్యం



చెరుకుపల్లి: ప్రపంచం సాంకేతికంగా దూసుకుపోతున్న ఈ తరుణంలో ప్రతి ఒక్కరూ మూఢ నమ్మకాలకు దూరంగా జీవించేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని ఉమ్మడి గుంటూరు జిల్లా గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని గుళ్ళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం బాపట్ల జిల్లా 18వ వార్షిక సభ (జిల్లా ప్లీనరీ) మండల అధ్యక్షుడు కాటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండల ప్రధాన కార్యదర్శి కుంచా రామ్మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలపై పోరాటం, పర్యావరణ పరిరక్షణ, విద్య, ఆరోగ్యం, సామాజిక అభివృద్ధి వంటి అంశాల్లో జేవీవీ కృషిని వివరించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ కోణంలో ప్రశ్నించే తత్వాన్ని పెంచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయటం కోసం ప్రతి పాఠశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పలువురు ఉపాధ్యాయులు, జేవీవీ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, విశ్రాంత డీఎల్‌పీవో తాతా శివ శంకరరావు గుళ్లపల్లి, చెరుకుపల్లి జడ్పీ పాఠశాలల హెచ్‌ఎంలు కె.కవిత, కె.లక్ష్మీనారాయణ, యూటీఎఫ్ నాయకులు బాదావత్ సాంబయ్య నాయక్, మచ్చా వెంకటేశ్వరరెడ్డి, రావూరి హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కార్యకర్తలకు అండగా ఉంటా

భట్టిప్రోలు: వేమూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ఎలాంటి దాడులు జరిగినా అక్కడకు తాను వచ్చి వారికి అండగా ఉంటానని ఆదివారం వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. పత్రికా సమావేశాలలో రాజకీయ సన్యాసం తీసుకుంటున్నానన్న భట్టిప్రోలుకు చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా వ్యక్తిగత దూషణలు చేయనంటూనే సమావేశం ఏర్పాటు చేయడం ఎంత వరకు సబబని అన్నారు. పంచాయతీలో అవినీతి వ్యవహారం జరిగిందని చెబుతూనే వ్యక్తిగత విమర్శలు చేయడం, సవాలు చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. సాయిబాబాను ఉద్దేశించి మాట్లాడుతూ "ఎప్పుడైతే భట్టిప్రోలు పరిధిలోని అద్దేపల్లిలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని దహనం చేయించి పాపం కూడగట్టుకున్నావో.... నీ రాజకీయ గురువు దివంగత సీఎం, గవర్నర్ కొణిజేటి రోశయ్య ఆత్మఘోష నీకు శాపంగా మారింది. ఒక పత్రికా విలేకరిగా పని చేసిన నీవు విలువలు పాటించకుండా మరో విలేకరిని వాడు, వీడు అంటూ దూషణలు చేయడం నీ మనస్సాక్షికే వదిలేస్తున్నా. నీ అక్రమాలను ఎక్కడ బయటపెడతానోనని బయటకు రానివ్వకుండా పోలీసులతో అడ్డగించావని ప్రజలకు తెలుసు. మంచి చేయాల్సింది పోయి టీడీపీ కూటమి అధికారం అడ్డుపెట్టుకుని ఇప్పటికే దోచుకోవడం మొదలెట్టారని" విమర్శించారు.

పాఠశాలలకు తీవ్రంగా నష్టం చేసిన 117 జీవో రద్దు చేయాలి

- ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్
- సత్తెనపల్లిలో ఏపీటీఎఫ్ ప్రాంతీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మహమ్మద్ ఉస్మాన్


సత్తెనపల్లి: విద్యారంగంలో సమస్యల్ని పరిష్కరించి గాడిలో పెడతామని ప్రకటించిన ఈ ప్రభుత్వం మళ్లీ అవే తప్పిదాలను కొనసాగించాలని చూస్తున్నట్లు తెలుస్తోందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో రాష్ట్ర కౌన్సిలర్ బండి రమేష్‌బాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ప్రాంతీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలకు తీవ్రంగా నష్టం చేసిన 117 జీవో రద్దు చేస్తామని ప్రకటించి కూడా ఇప్పటి వరకు ఆ ప్రయత్నం చేయలేయకపోవడాన్ని తప్పుపట్టారు. ఇప్పుడు తాజాగా జరగనున్న పని సర్దుబాటు ఆ జీవో ప్రకారం చేయాలని అధికారులు ఒక సమావేశంలో తెలిపినట్లు తెలుస్తోందని, ఆ జీవోను రద్దు చేయాలని ఆయన కోరారు. 10 మంది విద్యార్థుల లోపు ఉన్న పాఠశాలలను మూసివేసే ప్రయత్నం కూడా చేస్తున్నట్లు తెలుస్తోందని, ఇది విద్యారంగానికి, పాఠశాలల మనుగడకు తీవ్రహాని చేసే నిర్ణయమని విమర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంటనే పదోన్నతులు చేపట్టి అర్హత ఉన్నవారిని పై క్యాడర్‌లో నియమిస్తే పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే విధంగా ఉపాధ్యాయ సంఘాల సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాస రావు మాట్లాడుతూ బోధనేతర యాప్‌లు రద్దు చేయాలని, తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు బాల శ్రీనివాసరావు, బర్రా శ్రీనివాసరావు, సత్తెనపల్లి జోన్ పరిధిలోని వివిధ మండలాల నాయకులు శివారెడ్డి, ధర్మారావు, సునీల్ కుమార్, భావనా రుషి, ఐ.వెంకటేశ్వరరావు, పి.మారుతి, రమేష్, మదన్మోహన్, కిరణ్‌కుమార్, ఫిరోజ్ పాల్గొన్నారు.

విద్యార్థిని ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించలేదు

సంతగుడిపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ బాలశౌరీలు

రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు గ్రామంలోగల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన సరిమెళ్ల సన్నిధి ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించలేదని ప్రిన్సిపాల్ పి.యల్.బాలశౌరీలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నవరప్పాడు గ్రామానికి చెందిన సరిమెళ్ల సన్నిధి తమ స్కూల్లో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుందన్నారు. తమ స్కూల్లో చదువుతున్న విద్యార్థినిలకు విద్యతోపాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తున్నామని అన్నారు. తల్లిదండ్రులకు వారి పిల్లల ఆరోగ్య పరిస్థితులపై తెలియజేస్తామన్నారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన సన్నిధి పబ్లిక్ పరీక్షలు రాసే సమయంలో జ్వరం వచ్చిన బాధపడుతుంటే వైద్య పరీక్షలు నిర్వహించామని అన్నారు. అనంతరం ఆమె తల్లిదండ్రులకు తెలియజేసి ఇంటికి తీసుకెళ్లమని చెప్పామన్నారు. విద్యార్థిని తండ్రి స్కూల్ దగ్గరకు వచ్చి పరీక్షలు అయిపోయిన తర్వాత తీసుకెళ్తామని చెప్పారన్నారు. పరీక్షలు జరిగినన్నీ రోజులు విద్యార్థిని తండ్రి ప్రతిరోజూ పరీక్ష కేంద్రం వద్దకు వచ్చే వారని తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో ఆమెకు 600 మార్కులకు 430 మార్కులు వచ్చాయని అన్నారు. ఆ విద్యార్థిని స్కూల్ నుంచి వెళ్లి నాలుగు నెలలు కావస్తుందని అన్నారు. ఇప్పుడు జ్వరంతో పాటు కామెర్లు వచ్చి శరీరంలో అవయవాలు దెబ్బతిని కదలలేని స్థితికి చేరుకుందని, అందుకు స్కూల్ ప్రిన్సిపాల్ కారణమని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించడం అవాస్తవమని ఖండించారు. కనీసం ఆ విద్యార్థిని ఏ హాస్పిటల్స్‌లో చికిత్స చేయించారో ఆ హాస్పిటల్ రిపోర్ట్స్ తమకు చూపించలేదన్నారు. ఆ విద్యార్థిని హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం రూ.15లక్షలు ఖర్చు అయిందని, ప్రభుత్వం బాధ్యత వహించి, తమపై చర్యలు తీసుకోవాలని వారు ఆరోపించడం దారుణమన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

'క్విట్ కార్పొరేట్'ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివ శంకరరావు

తాడేపల్లి రూరల్: కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న 'క్విట్ కార్పొరేట్' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివ శంకరరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శివశంకరరావు మాట్లాడుతూ.. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని నమ్మబలికిందని అన్నారు. ఆ తరువాత వ్యవసాయ రంగాన్ని విచ్ఛిన్నం చేసేలా నల్లచట్టాలు తీసుకువచ్చిందని మండిపడ్డారు. వ్యవసాయ రంగంతో సంబంధం ఉన్న అన్ని రంగాలలో అదానీ, అంబానీ కార్పొరేట్ కంపెనీల అధికారులను నియమించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 9వ తేదీన జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో, గ్రామాల్లో క్విట్ కార్పొరేట్ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం గుంటూరు జిల్లా నాయకులు మొలక శివసాంబిరెడ్డి, కె. రామస్వామి, వేములపల్లి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

లాడ్జి కేంద్రంగా పేకాట నిర్వహణ

- మెరుపు దాడి చేసిన మంగళగిరి టౌన్ పోలీసులు
- 14 మంది అరెస్ట్, రూ.1.73 లక్షల నగదు సీజ్



పేకాడుతున్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న మంగళగిరి పట్టణ ఎస్ఐ ఖాదర్ బాషా

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొన్ని లాడ్జీలను కేంద్రంగా చేసుకుని కొందరు జోరుగా పేకాట దందా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ లాడ్జీపై మంగళగిరి పట్టణ పోలీసులు ఆదివారం సాయంత్రం మెరుపు దాడి చేసి 14 మంది జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.73 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఖాదర్ బాషా మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, నార్త్ జోన్ డీఎస్పీ రవికాంత్, సీఐ వినోద్‌కుమార్‌ల ఆదేశాల మేరకు పేకాట నిర్వహిస్తున్న లాడ్జీలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. జాతీయ రహదారి వెంట తెనాలి ఫ్లైఓవర్ పక్కనే ఉన్న సాయి ప్రియాంక రెసిడెన్సీలో గుట్టుచప్పుడు కాకుండా ఓ గదిలో పేకాట ఆడుతున్నారని తెలిసిందన్నారు. తనిఖీ చేయగా పేకాట ఆడుతూ 14 మంది కనిపించారని తెలిపారు. వారి నుంచి 14 సెల్‌ఫోన్‌లతోపాటు రూ.1,73,560 నగదును, పేక ముక్కలను, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన తెలిపారు.

10న చిత్రలేఖన పోటీలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న బాలోత్సవం నిర్వాహకులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహించనున్న చిత్రలేఖన పోటీల బ్రోచర్‌ను ఆదివారం తాడేపల్లిలోని అమరావతి ఐకాన్‌లో బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలల అభివృద్ధి లక్ష్యంగా ఈనెల 10వ తేదీన ఈ పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. సమరయోధుల త్యాగాలు, వాటి ద్వారా సిద్ధించిన ఫలాలు యువతరానికి తెలియజేయడమే దీని ఉద్దేశమన్నారు. తాడేపల్లి రోటరీ క్లబ్ సభ్యులు రావూరి రమేష్‌బాబు మాట్లాడుతూ.. పోటీలను జయప్రదం చేయాలని కోరారు. పాల్గొన్న వారికి సర్టిఫికెట్, విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి జేవీ రావు, విశ్రాంత లెక్చరర్లు స్వాములు, బాలోత్సవం ప్రతినిధులు గాదె సుబ్బారెడ్డి, వై. సుబ్బారావు, ఎం. సంధ్యారాణి, వై.సుధ, బిట్రా రామారావు, ఎం .మనోహర్ రెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ప్రత్తిపాడు: పదిహేడేళ్ల బాలిక అదృశ్యమైన ఘటనపై ప్రత్తిపాడు పోలీసు స్టేషనులో కేసు నమోదైంది. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) పదో తరగతి వరకు చదివింది. ప్రస్తుతం ఇంట్లోనే ఖాళీగా ఉంటోంది. ఈ నెల 3వ తేదీ తెల్లవారుజాము నుంచి కనిపించడం లేదు. తల్లిదండ్రులు ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం ప్రత్తిపాడు పోలీసులను ఆశ్రయించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.